

థీక్ ఆర్ నో థీక్

గడియారంలో గంటల ముల్లూ, నిమిషాల ముల్లూ పెద్దా చిన్నా తారతమ్యాలు మర్చిపోయి ఆ గంట కబుర్లూ హడావిడిగానూ, ఆత్మీయంగానూ కలబోసుకుంటున్నవేళ బద్ధకంగా ఇల్లు చేరాడు సుబ్బారావ్.

రోజూ స్కూల్ నుంచి గెంతుకుంటూ ఇంటికొచ్చే ఎల్.కె.జి పిల్లాడిలా హుషారుగా వచ్చేవాడు. ఈ రోజు కాస్త డీలా పడ్డట్టు ఉన్నాడు. కారణం రోజూ నిశ్శబ్దంగా ఆఫీసులో అందరి గురకా వినితరించే వాళ్లాఫీసు ఏసీకి సుస్తీచేసి తనే గుర్రుపెట్టడం మొదలుపెట్టింది. దాంతో అతి రంచనుగా చేసే సుబ్బారావు 'కార్యాలయ నిద్రాదీక్ష'కి భంగం కలిగింది.

భర్త రావటంతో చదువుతున్న వీక్లీ పక్కన పెట్టి, సగం తిన్న పకోడీల ప్లేటుని చెంగుచాటున దాస్తూ..వంటింట్లోకి నడిచింది సుందరి. కాఫీ కప్పు అందిస్తున్న సుందరి రెండోచేతిలో పకోడీల ప్లేటు లేకపోవడంతో నిరాశపడ్డాడు సుబ్బారావు. వేడి వేడిగా వేసుకొస్తుందేమో అని కాసేపు చూశాడు. కానీ, సుందరికి ఆ ఉద్దేశం ఏ కోశానా లేనట్టు కాసేపటిక్రితం బోర్లించి పెట్టిన వీక్లీని వెనక్కి మడిచి చదవటంలో మునిగిపోయింది. ఖాళీ కప్పులు టీపాయ్ మీద పెట్టి, సోఫాలో వెనక్కివాలి ఆఫీసులో భంగపడ్డ నిద్రాదీక్షని ఇంట్లో కొనసాగించడానికి ప్రయత్నిస్తూ కళ్ళు మూసుకున్నాడు.

భార్య పెట్టకపోతేనేం! 'పకోడీలు షత్రా' అని భర్తగా దర్జాగా ఆర్డర్ వెయ్యచ్చుకదా అని సందేహం రావచ్చు. అహ..సుబ్బారావు అలా ఎన్నటికీ చెయ్యడు. చెయ్యలేడు..ఎందుకంటే...

★ ★ ★

డబుల్ ధమాకాలాగా పట్టుమని పాతికేళ్ళు నిండని సుబ్బారావుకి మంచి ఉద్యోగం రావడం, ఆ మాంచి ఉద్యోగానికీ సుందరితో పెళ్ళి జరగడం రెండూ ఒకే సమయంలో జంటగా జరిగిపోయాయి. కళ్యాణం కక్కు సామెతలాగా..సుబ్బారావు బంధుమిత్రులంతా చాలా సంబరపడ్డారు. వాళ్ళ బామ్మయితే మరీను. టౌన్‌లో కొత్త కాపురం పెట్టించి, ఆమె కాశీ రామేశ్వరానికీ, అటునించి అటే కేదార్‌నాథ్, బదరీనాథ్..ఇంకా కాలం ఖర్మం కలిసొస్తే అమర్‌నాథ్, మానస సరోవరం కూడా చూసిరావటానికి 'లైఫ్‌టూర్' పేకేజీ కింద టికెట్ బుక్ చేయించేసుకుంది. "అన్ని ఒక్కసారే ఎందుకు బామ్మా! నిన్ను చూడకుండా అన్నిరోజులు ఎలా" అంటున్న మనవడితో "ఓరి ఎర్రినాగన్నా..ఇలా అయితే నూట ముప్ఫయి రూపాయల ముప్పావలా కలిసొస్తుందిరా" అంటూ నచ్చచెప్పింది.

బెడ్డింగూ అవీ సర్దేశాకా, మనవణ్ణి పక్కకి తీసుకెళ్ళి కొత్తపెళ్ళాంతో ఎలా నెగ్గుకొస్తాడో అని బాధపడుతూ..కొత్తకాపురం ఎలా చక్కబెట్టుకోవాలో, భర్తగా తన హక్కుల్ని ఎలా కాపాడుకోవాలో కూలంకషంగా వివరించింది. "అసలు మీ తాతగారి కాలంలో..." అంటూ మొదలుపెట్టి, ఆయనెలా మీసాల మీద నిమ్మకాయలు నిలబెట్టేవాడో తనతో సహా ఇంటిల్లిపాదినీ ఎలా కంటిచూపుతో శాసించేవాడో ముప్పైమూడు ఎపిసోడ్లలో చెప్పేసి, నువ్వు మీ నాన్నలా కాకుండా, 'శ్రీశ్రీశ్రీ పులిపిలక వీర వెంకట వరాహ పెద సుబ్బారావు'గారి మనవడిలా, మన వంశం కీర్తి నిలబెట్టాలిలా అంటూ ప్రాధేయపడింది. కొడుకు వల్లకాని పని మనవడు 'చిన సుబ్బారావు' ద్వారా సాధించాలని ఆత్రపడింది.

"ఒరేయ్..సుబ్బడూ..ఒకటి గుర్తుంచుకో..మెత్తవోణ్ణి చూస్తే మొట్టబుద్ధేస్తుంది. పెళ్ళానికయితే మరీను. నువ్వు మొగాడివి, మొగుడివి, మగమహారాజువి కాబట్టీ అదురూ బెదురూ లేకుండా నీ పెళ్ళాంతో అన్ని సేవలూ చేయించుకో. ఎప్పుడూ పెళ్ళాం ముందు చేయి చాచకు. భర్తగా అజమాయిషీ చెలాయించు. అది నీ జన్మహక్కు తెలిసిందా! 'నువ్వు మగాడివి, భార్యని అజమాయిషీ చెయ్యడం నీ హక్కు' అన్న స్లోగన్‌ని పదే పదే రీ సౌండ్ వాయిస్‌లో వినిపించింది. ఆవిడేదో ఆపద్ధర్మంగానూ..ఆచారంలో భాగంగానూ చెప్పిందానిని సుబ్బారావు సీరియస్‌గానే తీసుకున్నాడు.

ప్రయాణం హడావిడిలో ఆవిడ చెప్పడం ఆయన అడగటం మర్చిపోయిన అతి ముఖ్యమైన విషయం 'భార్య మీద అధికారం చెలాయించడం ఎలా?' అన్నది. అయ్యో బామ్మ ఎంత పని చేసిందీ! ఆయుధం చేతికిచ్చింది కానీ దాన్ని ఎలా ఉపయోగించాలా చెప్పడం మర్చిపోయిందీ! సెల్ టవల్ ఎక్కించి 'ఇక్కడ నుంచి దూకెయ్' అన్నంత తేలిగ్గా చెప్పేసి వెళ్ళిపోయింది. ఇప్పుడెలా అని కాసేపు బాధపడ్డా, అంతలోనే ధైర్యం తెచ్చుకున్నాడు. పోనీలే..అదెంత పనీ, నేనే నేర్చుకుంటాను అనుకున్నాడు. సుందరికీ ఈ విషయంలో అనుమానం రాకుండా జాగ్రత్తగా ఉండాలి అని తన చెవిలో తానే చెప్పుకున్నాడు.

ముందురోజు రాత్రి పంచాంగం చూసి పెట్టుకున్న సుముహూర్తం ప్రకారం సూర్యుడి కంటే ముందే లేచాడు సుబ్బారావ్. గొప్ప ఉత్సాహాన్నిచ్చే టూత్‌పేస్ట్‌తోనూ, బోల్డంత శక్తినిచ్చే టాయిలెట్ సోప్‌తోనూ పనులు కానిచ్చేసి, ఓమారు బామ్మని తలుచుకుని, పులి పిలక వంశగౌరవానికి వందనాలు సమర్పించి, 'భర్తగా' తన అధికారాన్ని చెలాయించే బృహత్తర బాధ్యతకి శ్రీకారం చుట్టాడు.

బాత్రూంలో నాలుగైదుసార్లు రిహార్సల్ వేసుకున్న 'డైలాగు'తో హాల్లోకొచ్చాడు.

'సుందరీ కాఫీ షత్రా' అని పులిలా గాండ్రించాడు.

అది కాస్తా సుబ్బారావు గొంతు దాటేసరికి గాంభీర్యాన్ని కోల్పోయి పిల్లికూతలా బయటికొచ్చింది. ఛీ..ఛీ..వెధవ పిల్లి అని సుందరి విసుక్కోటం వినిపించింది. గొంతు సకిలించి నాలుగైదుసార్లు ప్రయత్నించాడు సుబ్బారావ్. ఫలితాలు సంతృప్తికరంగా కనిపించలేదు. ఇక లాభం లేదని గ్రహించి, దగ్గరగా వెళ్ళి 'సుందరీ కాఫీ' అన్నాడు నీరసంగా.

బదులుగా 'పాలు' అంటూ వీధికేసి వేలుచూపింది సుందరి. "ఇక నుంచీ ఇలాగే పెందరాళే లేచి వీధి చివరి నించీ పాలపేకెట్టు తెచ్చే బాధ్యత మీదే!" అంటూ సుబ్బారావుని 'వీధిపాలు' చేసింది సుందరి.

అంతేనా..."నేను గుమ్మంలో ముగ్గేసి వచ్చేలోగా మనిద్దరికీ కాఫీ చేసెయ్యండీ" అంటూ గారాలు పోయింది. నే స్నానం చేసొచ్చేలాగా కూరలు తరిగెయ్యండి అంటూ ఆర్డరు పాస్ చేసింది.

సుబ్బారావుకి పరిస్థితి అగమ్యగోచరంగా తోచింది. సుబ్బారావు మనసు లోపల్లోపలే కీచుగా రోదించింది.



అంతతోనే 'మగ మహారాజులు నిబ్బరంగా ఉండాలి' అన్న ప్రతిధ్వని వినిపించింది.

సాధనమున పనులు సమకూరు ధరలోన అన్నారు కదా! దేనికయినా..అదే వర్తిస్తుంది కాబోలు. అని ప్రయత్నిస్తూ 'ఆ విధంగా ముందుకు పోదాం' అని నిశ్చయించుకుని తనకు తనే ధైర్యం చెప్పుకుని ఉత్సాహపరుచుకున్నాడు.

ఓ రోజు ఆఫీసునుంచి వస్తూ సెంటర్లో పెద్ద గుంపును చూసి, ఆ విశేషమేంటో తానూ తెల్సుకుందామని అటుకేసి వెళ్ళాడు. అక్కడ కొన్ని మహిళా సంఘాల వాళ్ళు రోడ్డుకడ్డంగా బైఠాయించి తెలుగు కుటుంబ కథాచిత్రాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. సినిమాల్లో భర్తలు భార్యల్ని ఏమేవ్, ఓసేవ్ అంటూ అసభ్యకరంగా సంబోధిస్తున్నారని, ఎప్పుడూ భార్య పాత్రలే టీలు, కాఫీలు ఇస్తున్నట్టు 'భర్త' పాత్ర కుటుంబం మీద, భార్యమీద అధికారం చెలాయిస్తున్నట్టు అసహజంగా చూపిస్తున్నారనీ, దీనివల్ల సమాజంలో పురుషులను తప్పుదోవ పట్టిస్తూ..వారికీ నిజ జీవితంలో భార్యల మీద అధికారం చలాయించాలనే దురుద్దేశాన్ని కలిగిస్తున్నాయనీ కాబట్టి అటువంటి కుటుంబ కథాచిత్రాలను నిషేధించాలని..ఒకరి తరువాత ఒకరు ప్రసంగిస్తుంటే..జనంతో పాటు ట్రాఫిక్ కానిస్టేబులు కూడా తన్మయత్వంతో వింటున్నాడు.

మిగతా ప్రసంగాల మాట ఎలా ఉన్నా భర్తలు అధికారం అన్న తేట మాటలు సుబ్బారావు చిన్నమెదడుకి సూటిగా తగిలాయి. వాడిపోయిన ఆశలు చిగురించాయి.

కుటుంబ కథాచిత్రాల ద్వారా తన అన్వేషణ ఫలించే అవకాశాలు మెండుగా కనిపించాయి. దానితో ఇంటికెళ్ళి కాఫీ తాగే కార్యక్రమాన్ని నిరవధికంగా వాయిదా వేసి కుటుంబ కథాచిత్రం ద్వారా తన ఆశలు తీర్చుకొనే ఆలోచనకి అంకురార్పణ చేశాడు.

ఆ చిన్న టౌన్లో వున్న అరడజను సినిమా థియేటర్లకీ స్కూటర్‌తో ఓ రౌండు వేస్తూ ఏది కుటుంబ కథాచిత్రమో తేల్చుకోలేక సతమతమౌతుంటే.."అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేదే అసలైన కుటుంబ కథాచిత్రం" అని ఎక్కడో చదివింది గుర్తొచ్చి ఆరేళ్ళ నుంచీ అరవై ఏళ్ళ వాళ్ళంతా ఎగబడి టికెట్లు కొంటున్న ఓ థియేటర్ ముందు స్కూటర్ పార్క్ చేశాడు. 'ఇంత పొడువాటి క్యూలో దూరి టికెట్ సంపాదించగలనా?' అని సందేహంగా చూస్తుంటే, గళ్ళలుంగీ, చారల బనీను వేసుకున్న ఓ మీసాలవాడు సుబ్బారావు దగ్గరకొచ్చి అటూ ఇటూ చూసి సినిమా టికెట్ ఒకటి సుబ్బారావు చేతిలో కుక్కేసి దర్జాగా జేబులోంచీ అయిదొందల కాగితం తీసుకుని, సుబ్బారావు తేరుకునేలోగా జనంలో కల్సిపోయాడు.

ఆ మర్యాదకి ఆశ్చర్యపడీ అంతలోనే తేరుకుని థియేటర్లో దూరాడు సుబ్బారావ్.

కొంతసేపటికి థియేటర్లో హాహాకారాలు 'పేరు చూసి ఇదేదో దేవుడి సినిమా అనుకున్నాం. కోతులు, మూతులూ చూసి 'రామావతారం' అనుకున్నాం. ఇదెక్కడి 'అవతారం' మొర్రో అని హాహాకారాలు చేసుకుంటూ థియేటర్లో మూడొంతులున్న ఓ వర్గం ప్రేక్షకులంతా కట్టకట్టుకుని తలుపులు తీసుకుని బయటపడ్డారు.

"మిమ్మల్నందరినీ చూసి ఇదేదో కుటుంబ కథాచిత్రమనుకుని నాక్కావాల్సిన సీన్లు పుష్కలంగా ఉంటాయని మోసపోయాను మొర్రో" అని సుబ్బారావు చేసిన ఆలాపన కూడా వారి ఆక్రందనలో కల్సిపోయింది. ఆ అనుభ

వంతో దెబ్బతిన్న సుబ్బారావు చాన్నాళ్ళవరకూ కోలుకోలేదు. కోలుకునే క్రమంలో కొన్నిరోజులు పూర్తిగా టీవీకే అంకితం అయిపోయాడు. సీరియల్ నోము నోచినట్టూ రోజూ క్రమం తప్పక సుందరి చూపించే సీరియల్స్ అన్నీ ఏడుస్తూ చూసేసాడు. ఆ నంద ర్భంగా సుబ్బారావు ఓ అతి పాత సంగతి కొత్తగా కనిపె ట్టాడు. అదేవిటంటే...అన్ని సీరియల్స్‌లోనూ, అనేవీ-పడేవీ, తిట్టేవి-ఏడ్చేవి, చంపేవి-చచ్చేవి అన్నీ ఆడ పాత్రలే. చెప్పుకోటానికీ రెండేసి మగ పాత్రలున్నా అన్నీ 'తానాతందానా' అన్నట్టు ఉన్నాయి. వాళ్ళకో డైలాయిగ యినా లేదు. ఇంకెందుకూ కాస్ట్యూమ్స్ దండగ అనుకు న్నాడు. పైగా సీరియల్స్ పేర్లలో కూడా ఫిమేల్ డామినే షన్ స్పష్టంగా కనిపెట్టేశాడు. 'కన్నీళ్ళ కళ్యాణి' 'పెళ్ళా దని నుమంగళి' 'మూకిట్లో ముత్యాల ముగ్గు'

ఇలా....

'అంతేలే..తీసేది మీరు. చూసేది మీరు. ఏడ్చేదీ మీరే. ఓదార్చుకునేది మీరే' అనుకున్నాడు విరక్తిగా.

అప్పుడప్పుడూ వాళ్ళ బామ్మ కలలో కనిపించి యాత్రా విశేషాలు చెపుతూ "నే చెప్పింది గుర్తుందా!" అని హెచ్చరించి వెళుతుంది.

దాంతో ఆశ తీరక కోరిక చావక అన్నట్టు తయారయింది సుబ్బారావు పరిస్థితి.

అన్ని విషయాల మీద పుస్తకాలు ఉన్నాయి కదా ఇంత ముఖ్యమైన విషయం ఏ 'ఆశాజీవో' భవిష్యత్తు తరాల కోసం గ్రంథస్థం చెయ్యకపోయి ఉంటాడా అన్న ఆశతో ఆ మార్గంలోనూ ప్రయత్నించాడు సుబ్బారావు. భర్తను కొంగున కట్టుకోవటం ఎలా? బట్టలు ఇస్త్రీ చేయటం ఎలా? వంటివి కోకొల్లలుగా కనిపించాయి. చివరికి పిల్లికి పాలుతాగడం, కుక్కకి తోక ఊపటం నేర్పించే పుస్తకాలు కూడా కనిపించాయి. కానీ సుబ్బా రావు వెతుకుతున్న భార్య మీద అధికారం చలాయిం చడం అన్న సబ్జెక్టుకు సంబంధించిన పుస్తకాలేవీ ఎంత వెతికినా దొరకలేదు.

భర్త ప్రయత్నాలు చూచాయగా కనిపెట్టింది సుందరి. 'చాదస్తపు మొగుడు చెబితే వినడు కొడితే ఏడు స్తాడు' అన్నట్టు ఏదైనా అనుభవం మీద తెలుసుకోందే వదిలేరకం కాదని గ్రహించి సుబ్బారావుకి జ్ఞానోదయం అయ్యే శుభవేళ కోసం ఎదురుచూస్తూ ఏమీ తెలియనట్టే ఉండిపోయింది.

రాను రాను సుబ్బారావుకి నిరాశ పెరిగిపోయింది. ఇక ఈ జన్మకి బామ్మ కోరిక తీర్చలేనా! పులి పిలక వారి వంశగౌరవం నిలబెట్ట లేనా? అని ఊరికే మథనపడిపోతున్న సమయంలో ఎండాకాలంలో వడగళ్ళవా నలా ఫ్రెండ్ వెంకట్ కలిసాడు. వెంకట్, సుబ్బారావు చిన్ననాటి స్నేహితులు. ఇంకేం...సుబ్బారావులో అణగారిపో యిన ఆశల దీపం మినుకు మినుకు మంటూ వెలగడం ప్రారంభించింది.

సినిమాల్లో గతం సీన్‌లా శూన్యం లోకి చూస్తూ సుబ్బారావు తన ఆశనీ, బామ్మ తన మీద పెట్టిన బాధ్యతనీ, అది నెరవేర్చడం కోసం తను పడుతున్న వృథాప్రయాసని 'బ్రేక్' లేని 'నిరం తర వార్తా స్రవంతిలా' చెప్పుకున్నాడు. అంతా విని "ఓస్..అంతేకదా!" అని తేలిగ్గా అనేశాడు వెంకట్. సుబ్బారావుకి బోల్డంత ఆశ్చర్యం, ఆనందం కూడా కల గాపులగంగా వచ్చేశాయి.

టెంతు మూడుసార్లు తప్పి, ఆపై ఇంటర్లో మరో డింకీ కొట్టి, ఆపై డిగ్రీతో సరిపెట్టేసి టౌన్లో ఉద్యోగం కొన డానికి ఊర్లో రెండెకరాల పొలం అమ్మేసిన వీడే 'ఓస్ అంతేనా' అని అంత తేలిగ్గా అన్నాడంటే..టెంతు స్కూల్ ఫస్టొచ్చి, ఆపై మెరిట్ స్కాలర్‌షిప్‌తో తెగ చదివేసి, ఫస్ట్ ఇంటర్వ్యూతోనే బెస్ట్ జాబ్ కొట్టేసిన తనకింకెంత 'ఓసోస్' అయి ఉంటుందీ అనవసరంగా ఇన్నాళ్ళూ ఎంత కంగారుపడ్డాను అనుకొంటూ చాలా ఉత్సాహపడి పోయాడు.

జీవితంలో చదివే చదువుకీ, తెచ్చుకునే మార్కులకీ, ఎదుర్కొనే సమస్యలకీ, బొత్తిగా మేచింగ్ ఉండదనే అప్ పటికింకా అనుభవంలోకి రాలేదు సుబ్బారావుకి. ఎంతైనా లేత సంసారి కదా!

"సరే. నే చెపితే అర్థం కాదు కానీ, మా ఇంటికిరా చూసి నేర్చుకుందువుగాని..." అంటూ సుబ్బారావుని తనింటికి తీసుకుపోయాడు.

స్నేహితునికి భార్యని పరిచయం చేశాడు. "ఒరేయ్..సుబ్బూ నా భార్య అని పొగడ్డం కాదు కానీ, మా సుగుణ పేరుకే కాదు గుణానికీ బంగారం, ఓర్పులో భూదేవి, సహనంలో శ్రీదేవి, అతిథుల్ని ఆదరించడంలో జెనీలియా, వండి వడ్డించడంలో ఇలియానా, నవ్విదంటే నయనతార.." అంటూ అష్టోత్తరం చదివేశాడు.

"అబ్బా..చాల్లెద్దురూ..మీ రెప్పుడూ ఇంతే. పరాయి వాళ్ళ ముందు పొగడొద్దండీ అంటే వినరు" అని సిగ్గుప డుతూ, భర్త జబ్బ గట్టిగా గిల్లేసి "కాఫీ తీసుకొస్తాను"

కన్నడ స్వాతి

టీవీ రంగంలో 'కలర్స్ స్వాతి'గా పేరు తెచ్చుకున్న అచ్చతెలుగు అమ్మాయి స్వాతికి 'అష్టాచెమ్మా' సినిమా ద్వారా అవార్డులు కూడా వచ్చాయి. తెలుగులో అవకా శాల సంగతి ఎలా వున్నా ఆమెకి పొరుగున వున్న తమిళ రంగం నుంచి కూడా ఆహ్వానం వచ్చింది. ఆమె నటించిన తొలి తమిళ చిత్రం 'సుబ్రమణ్యపురం' మంచి గుర్తింపు తెచ్చింది. ఇది తెలుగులో 'అనంతపురం-1980'గా అను వాదం అయింది. కొత్తగా స్వాతికి ఓ తమిళ చిత్రంలో విక్రమ్ సరసన నటించే అవకాశం కూడా లభించింది. తాజాగా ఆమెకి కన్నడం నుంచి కూడా పిలుపు వచ్చింది.

అంటూ వెళ్ళి అర నిమిషంలో కాఫీ ఫలహారాలతో ప్రత్యక్షమై మరు నిమిషంలో మాయమయిపోయింది.

సుబ్బారావుకేసి చూస్తూ గర్వంగా కళ్ళెగరేశాడు వెంకట్.

అప్పటిదాకా టీవీలో వచ్చే దిక్కుమాలిన చర్చాకార్యక్రమం సమన్వయకర్తలా మొహమాటం నవ్వు ముఖానికి పులుముకు కూర్చుని ఇబ్బందిగా కదులుతున్న సుబ్బారావు

"దీన్ని 'అధికారం చలాయించడం' అనరేమోరా!" అన్నాడు అమాయక చక్రవర్తిలా మొఖం పెట్టి.

"తెలుసులేవోయ్..దీన్ని లౌక్యం అంటారు. అంటే ఎక్కడ వేసే వేషాలు అక్కడ వెయ్యటం అన్నమాట. దర్జాగా బ్రతకడానికి నాకు తెలిసిన దారి' 'లౌక్యము కలిగిన సౌఖ్యము కలుగును' ఎలా ఉంది కొటేషను" అంటూ పళ్ళికిలించాడు వెంకట్.

"ఏదీ చిన్నప్పుడు నీకు బహుమతి వచ్చిన పద్యం ఓసారి చెప్పు" అనగానే.. సుబ్బారావు లేచి నుంచొని దండలు కట్టుకొని "ఎప్పటికెయ్యది ప్రస్తుతమో అప్పటి కామాట లాడి తప్పించుకు తిరుగువాడె నేర్పరి సుమతీ" అని గుక్క తిప్పుకోకుండా అప్పచెప్పేసి తన జ్ఞాపకశక్తికి తనే మురిసిపోయాడు.

"సెభాష్.. బట్టీ పట్టేయడం కాదు. ఇటువంటి సుభాషితాలని సందర్భానుసారం జీవితానికి అన్వయించుకుని కులాసాగా బ్రతికెయ్యాలోయ్. గిరీశంలా ఫోజుకొట్టకు" వెంకట్ అదే ఫోజులో లెక్చర్ కంటిన్యూ చేస్తూ "ఓరి నా వెర్రి బుడుగూ, నువ్విలా మీ బామ్మకాలం నాటి అస్త్ర శస్త్రాలతో తిరిగితే బెయిల్ దొరకని ఏక్టులో ఇరికించి కుమ్మేసే ప్రమాదం వుంది. మీ బామ్మ నీ చెవిలో చెప్పిన మంత్రానికీ, నీ చేతికొచ్చిన ఆయుధానికీ ఇప్పుడు లైసెన్స్ రద్దయిపోయింది. ఇంకా నీ భార్య మంచిది కాబట్టి సరిపోయింది. లేకపోతే నువ్విలాంటి ఆలోచనతో ఉన్నావని కేసు పెట్టిందంటే... జీవితంలో బయటికి రాలేనంత స్ట్రాంగ్‌గా ఉన్నాయి చట్టాలు తెలుసా! అందువల్లనే చెప్పొచ్చేదేంటంటే...' అనువుగాని చోట అధికుల మనరాదు' అదీ సంగతి. మరిక నువ్వు దయచేస్తే, నేనూ మా ఆవిడా ఆడుతూ పాడుతూ పని చేసుకుంటాం" అంటూ బలవంతంగా బై బై చెప్పేసి స్నేహితుణ్ణి సాగనంపేశాడు వెంకట్.

అయోమయంగా ఇల్లుచేరిన సుబ్బారావుని వాళ్ళ బామ్మ రాసిన ఉత్తరం పలకరించింది.

'ఒరేయ్..సుబ్బుడూ నీకో ముఖ్య విషయం చెప్పటం కోసం ఈ ఉత్తరం రాస్తున్నాను. నేను వచ్చేముందు నీకు అప్పగించిన బాధ్యత, బరువూ ఇక నువ్వు మొయ్యనక్కర లేదు. ఎందుకంటే, మన పులి పిలక వారి వంశ గౌరవాన్ని నేనిక్కడ కాశీలో వదిలేశాను. కాబట్టి నువ్వు అధికారం, అజమాయిషీ అని, నీ పెళ్ళాన్ని వేపుకు తినకు. నాయనా..సుబ్బులూ కాలం మారిపోయిందిరా! రోజులలే బాగాలేవు. అమ్మాయితో జాగ్రత్తగా మసులుకో. నీ ఆరోగ్యం జాగ్రత్త.

ఇట్లు

నీ బామ్మ'

ఉత్తరం చదువుతూనే సుబ్బారావు హుషారుగా విజిలేశాడు. డాన్సేసాడు. పాట కూడా పాడేశాడు. డెట్టాల్ సోప్‌తో స్నానం చేసినట్టు హాయిగా ఫీలయ్యాడు. ఈ వీరంగాలన్నీ తలుపు చాటునుంచీ గమనిస్తున్న సుందరి ముసిముసిగా నవ్వుకుంది. కాశీ నుంచి వచ్చిన ఉత్తరానికీ, వీధి చివరి పోస్టు ఆఫీసు నుంచి వచ్చిన ఉత్తరానికీ కూడా తేడా తెలీని భర్త అమాయకత్వానికి మురిసిపోయింది.

వంశగౌరవం తాలూకూ బరువూ బాధ్యతలు వదిలిపోయిన సుబ్బారావు స్నేహితుడు వెంకట్ ఉపదేశాల్ని ఓసారి మననం చేసుకుని సుమతీ శతకం, భాస్కర శతకం, కొన్ని భజన పాటలు కూడా సాధన చేసి వాటిని సందర్భానుసారంగా తన జీవితానికి అన్వయించుకుంటూ..అడిగి లేదనిపించుకోకుండా, దర్జాకు లోటు రాకుండా కులాసాగా బ్రతికేస్తున్నాడు.

"ఏవండోయ్..సోఫాలోనే నిద్రపోతున్నారా" అన్న సుందరి పిలుపునకు మెలుకువ రాగా, ప్లేటులోని వేడి వేడి పకోడీల వాసనకి బద్ధకం అంతా వదిలిపోయింది.

"వీక్లీలో చూసి వంకాయ పకోడీ చేశాను. మధ్యాహ్నం చేసినవి కుదరలేదు. మావాడి ఆరోగ్యం జాగ్రత్తమ్మా, అని మీ బామ్మగారు మరీ మరీ చెప్పారు. శ్రద్ధగా చదివి మళ్ళీ ట్రై చేశాను. ఈసారి బాగా కుదిరాయి. తినండి" అంటూ ప్రేమగా సుందరి అందించిన పకోడీల ప్లేటు అందుకుని "సుందరీ..సుందూ..దూ.." అని మురిసిపోతూ "భోజ్యేషు మాతా.." అంటూ అరిగిపోయిన రికార్డ్ ఆన్ చేశాడు సందర్భానికి తగ్గట్టు, బ్రతకనేర్చిన సుబ్బారావ్.



శ్రియ ఐటమ్ సాంగ్

హీరోయిన్ శ్రియకి తెలుగులో సినిమాలేవీ లేవిప్పుడు. గతంలో ఆమె ఒకటి రెండు చిత్రాల్లో ఐటమ్ సాంగ్స్ చేసింది. తాజాగా పవన్ కల్యాణ్ చిత్రం 'పులి'లో కూడా శ్రియ ఐటమ్ సాంగ్ చేసిందని టాలీవుడ్ న్యూస్. ప్రస్తుతం తమిళ, మలయాళం చిత్రాల్లో హీరోయిన్‌గా నాలుగైదు చిత్రాలు చేస్తోన్న శ్రియ తెలుగులో ఈ ఐటమ్ సాంగ్‌ని నాలుగు రోజుల్లో పూర్తి చేసిందిట. ఈ సాంగ్ ప్రేక్షకుల్ని బాగా ఆకట్టుకుంటుందనే నమ్మకంతో వున్నాడు దర్శకుడు సూర్య. దీని తర్వాతయినా ఆమెకి తెలుగులో చాన్స్‌లు పెరుగుతాయేమో!